సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



ఆక్వాకు అందని ఫలాలు

ఆక్వా దాణా ధరలకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో పన్ను తగ్గించినా రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో రైతులు పెదవి విరుస్తున్నారు. 8లో ▸



చిన్నతిరుపతికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు. శ్రావణమాస పర్వదినాలను పురస్కరించుకుని వేలాది మంది తరలివచ్చారు. 8లో ▸



మంచం పట్టిన పల్లెలు

వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రతి జిల్లాలో ఏలూరుతో పాటు ప్రధాన మున్సిపాలిటీల్లోని ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరాల కేసులతో కిటకిటలాడుతున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు



ఆలయ యాగశాలలో వాస్తు హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో చినవెంకన్న దివ్య పవిత్రోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ యాగశాలలో అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యహవాచనము, అఖండ దీపారాధన, వాస్తుపూజ, మృత్‌సంగ్రహణ, అలాగే వాస్తు హోమం, పవిత్ర శుద్ధి జరిపారు. అనంతరం అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతకముందు అర్చకులు, పండితులు పుట్టమన్ను తెచ్చి సిద్ధంగా ఉంచిన పాలికల్లో పోశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ నవధాన్యాలను పాలికల్లో ఉంచారు. దాంతో అంకురార్పణ ముగిసింది. ఆలయంలో ఏడాది పొడవునా తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను జరపడం సంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పవిత్రాదివాసాన్ని నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

సెబ్ అడిషనల్ ఎస్పీ బదిలీ

భీమవరం: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రం ఏర్పడిన నాటి నుంచి అదనపు సెబ్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న రవికుమార్‌ను ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు.

కంప్యూటరైజేషన్ త్వరగా పూర్తిచేయాలి



లంకలకోడేరు సొసైటీలో కంప్యూటరైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

పాలకొల్లు అర్బన్: జిల్లాలో ఎంపిక చేసిన సొసైటీల్లో ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని లంకలకోడేరు సొసైటీని శనివారం జేసీ తనిఖీ చేశారు. సొసైటీ అకౌంట్స్, ఆడిట్ అభ్యంతరాలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కంప్యూటరైజేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 122 సొసైటీల్లోనూ ప్యాక్ కంప్యూటరైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రికార్డులు కంప్యూటరైజేషన్ చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, డీసీసీబీ జీఎం మాధురి తదితరులున్నారు.

ఆళ్ల నాని రాజీనామా



ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రకటించారు. వ్యక్తిగత బాధ్యతల దృష్ట్యా రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ జిల్లా కార్యాలయం స్థలం లీజుకు ఇచ్చిన యజమాని తాను డెవలప్‌మెంట్‌కు ఇచ్చుకునేందుకు స్థలం ఖాళీ చేయాలని కోరారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు మూడు నెలల ముందే స్థలం ఖాళీ చేయాలని కోరగా, ఎన్నికల దృష్ట్యా పార్టీకి ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో యజమానితో మాట్లాడి వాయిదా వేసినట్టు చెప్పారు. ఆగస్టు 15 అనంతరం అప్పగిస్తామని చెప్పానని, ప్రస్తుతం అప్పగించామని వివరించారు.

చేతిరాత పోటీల్లో లక్ష్మీ కావ్యకు ప్రథమం

కైకలూరు: జాతీయ చేతిరాత పోటీల్లో ఏలూరు జిల్లా కైకలూరు నేషనల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని సీహెచ్.లక్ష్మీ కావ్య ప్రథమ స్థానం సాధించింది. ఎస్‌ఆర్‌ఐ నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ, అమ్మ ఒడి హ్యాండ్ రైటింగ్, అఖిల భారత హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఆన్‌లైన్ విధానంలో పోటీలు జరిగాయి. సుమారు మూడు లక్షల మంది కిపైగా పాల్గొన్న ఈ పోటీల్లో లక్ష్మీ కావ్య మొదటి స్థానం సాధించింది.

రోడ్డెక్కిన వైద్యులు



నరసాపురం : సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు



తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యుల నిరసన ర్యాలీ



పెనుగొండ : గాంధీబొమ్మల సెంటర్‌లో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మానవహారం

భీమవరం : కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యకు నిరసనగా పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు నిరసన చేపట్టారు. భీమవరం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవీ కల్యాణి నేతృత్వంలో గంట పాటు వైద్యసేవలు నిలిపివేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యసేవలు మినహా మిగిలిన సేవలను నిలిపివేసి ర్యాలీ నిర్వహించారు. ఆకివీడు సీహెచ్‌సీ పరిధిలో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. కాళ్ల, పాలకోడేరు, ఉండి పీహెచ్‌సీల పరిధుల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. పెనుగొండ సీహెచ్‌సీ, ఆచంట సీహెచ్‌సీ, మార్టేరు సీహెచ్‌సీ, ఆలమూరు, సిద్ధాంతం, ఆచంట వేమవరం, వల్లూరు పీహెచ్‌సీల వైద్యులు, ఆశా వర్కర్లు నిరసన ర్యాలీలు చేపట్టారు. పెనుగొండలో మానవహారం నిర్వహించారు. పాలకొల్లులో స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుంచి యడ్ల బజారు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నర్సాపురంలో వైద్యులు వైద్య సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. తణుకు ఐఎంఏ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్ నుంచి నరేంద్ర సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.



క్రేజీ.. క్రేజీ.. బాక్స్ క్రికెట్



భీమవరంలోని బాక్స్ క్రికెట్ కోర్టులో క్రికెట్ ఆడుతున్న యువకులు

మనది క్రికెట్ దేశం.. కొంచెం ఖాళీ సమయం దొరకాలే కానీ చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ గల్లీ క్రికెటర్స్ అయిపోతుంటారు. కాకపోతే.. నేటి నగరాల్లో క్రికెట్ ఆడటానికి కావాల్సినంత ఖాళీ ప్రదేశం దొరకడమే గగనం అయిపోతుంది. దీంతో ఒకే గ్రౌండ్‌లో రెండు మూడు టీంలు అలా సర్దుకుపోతూ క్రికెట్ ఆడుతూ తమ సరదాను కాస్త ఇబ్బంది పడుతూనే తీర్చుకుంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారమే 'బాక్స్ క్రికెట్'. ఇందులో బాల్ ఎదురుగా ఉన్న నెట్‌ను నేరుగా వెళ్లి తాకితే ఆరు పరుగులు..స్టెప్పులు పడుతూ వెళితే ఫోర్ రన్స్..పైకప్పుకి తగిలితే ఔట్.. సింగిల్స్, డబుల్స్, రనౌట్లు, క్యాచ్‌లు అన్నీ సేమ్ టూ సేమ్‌గానే ఉంటాయి.

సండే స్పెషల్

సాక్షి, భీమవరం: గల్లీ క్రికెట్ ఇప్పుడు బాక్స్ క్రికెట్‌గా మారుతోంది. నిన్నమొన్నటి వరకు నగరాల్లో కనిపించిన ఇండో టర్ఫ్‌లు పట్టణాలకు వచ్చేశాయి. ఫ్లడ్ లైట్లు, ఫుడ్ కోర్టు సదుపాయాలతో అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఔత్సాహికుల ఇంటి టెర్రాస్‌లపైనా మినీ టర్ఫ్‌లు వెలుస్తున్నాయి. విదేశాల్లో ఎప్పుడో మొదలైన ఈ బాక్స్ క్రికెట్ పదేళ్ల క్రితం భారత్‌లోకి వచ్చింది. మొదట ముంబైలో ఎక్కువగా దీన్ని ఆడేవారు. ఆ తర్వాత హైదరాబాద్, తిరుపతి, విశాఖ తదితర నగరాలకు ఇది వేగంగా విస్తరించింది.

పకడ్బందీ ఏర్పాట్లు

బాక్స్ క్రికెట్‌కు ఆదరణ బాగుండటంతో ఔత్సాహికులు వీటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఖాళీ స్థలాన్ని బట్టి 30–40 మీటర్ల వరకు పొడవు, 25–30 మీటర్ల వరకు వెడల్పు విస్తీర్ణం, 15 మీటర్ల వరకు ఎత్తులో చుట్టూ పకడ్బందీగా పోల్స్ ఏర్పాటు చేసి వాటికి చుట్టూ, పైన నెట్ అమర్చుతున్నారు. రాత్రి వేళల్లో ఆడేందుకు వీలుగా పై ఎత్తులో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బాక్స్ క్రికెట్ కోర్టు నిర్మాణానికి రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వర్షం వచ్చినా వెంటనే నీరు లాగేసే విధంగా డ్రైనేజీ వ్యవస్థ నెలకొల్పుతున్నారు. ఈ ఇండో టర్ఫ్‌లు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో 4, తణుకు, నరసాపురం, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో 15 వరకు ఉన్నాయి. ఏలూరు హైవే సమీపంలో కొత్తగా బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేసేందుకు భీమవరానికి చెందిన కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. కళాశాలల్లో విద్యార్థుల కోసం వీటిని ఏర్పాటు చేస్తుండగా కుటుంబ సభ్యులంతా కలిసి ఆడుకునేందుకు వీలుగా కొందరు ఔత్సాహికులు తమ ఇంటి టెర్రాస్‌లపైనా మినీ బాక్స్ క్రికెట్ కోర్టులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

వసతులను బట్టి చార్జీలు

బాక్స్ క్రికెట్ కోర్టులోని వసతులను బట్టి గంటకు రూ.700–1,000 వరకు చార్జ్ చేస్తున్నారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో ఈ ధర మరింత పెరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా ముందుగానే ఆడే సమయాన్ని బుక్ చేసుకోవచ్చు. కొన్నిచోట్ల యాప్‌ల ద్వారాను స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. క్రికెట్ కిట్‌ను నిర్వాహకులే అందజేస్తారు. ఎక్కువ మంది కలిసి ఆడటం వలన అందరూ తలాకొంత వేసుకుని చెల్లించడంతో ఆడేవారికి పెద్దగా భారం అనిపించదు.

కొడితే బాక్స్ బద్దలే

- శరవేగంగా పట్టణాలు, పల్లెలకు విస్తరిస్తున్న నగర సంస్కృతి
- పశ్చిమ గోదావరి జిల్లాలో 15కు పైగానే ఇండో టర్ఫ్‌లు
- అనుబంధంగా ఫుడ్ కోర్టులు
- రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలతో ఏర్పాటు
- గంటకు రూ.1,000 వరకు ఫీజు
- ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఆడుకునే సౌలభ్యం



భీమవరంలో ఓ ఇంటి టెర్రస్‌పై బాక్స్ క్రికెట్ కోర్టు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



బాక్స్ క్రికెట్ కోర్టు

వీకెండ్స్‌లో ఎక్కువగా..



భీమవరంలో ఎలైట్ స్పోర్ట్స్ ఎరీనా ఇండో టర్ఫ్ ప్రారంభించి ఏడాదిన్నర కావస్తోంది. ఆదరణ బాగుంది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వచ్చి ఆడేందుకు ఇష్టపడుతున్నారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తుంటారు.

– జి.సునీల్‌వర్మ, ఎలైట్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకుడు, భీమవరం

బాగా ఆస్వాదిస్తున్నా



సాయంత్రం పూట, సెలవు రోజుల్లో బాక్స్ క్రికెట్‌ను ఆస్వాదిస్తున్నా. ఆట స్థలాలు అంతగా లేకపోవడంతో స్నేహితులంతా కలిసి ఈ బాక్స్ క్రికెట్‌లోనే ఆడుకుంటున్నాం. అన్ని ఏర్పాట్లు ఉండటంతో పాటు రాత్రి వేళల్లో కూడా ఆడుకునే వీలుంది.

– ఆకుల లోకేష్, భీమవరం

పెరుగుతున్న ఆదరణ

ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిళ్లు ఆడే సౌలభ్యంతో పాటు శారీరకంగా పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేని రీతిలోనే నిబంధనలు ఉన్నాయి. చిన్న గ్రౌండ్ కావడంతో బంతి కోసం ఎక్కువ దూరం పరిగెత్తాల్సిన అవసరం ఉండదు. టీముల్లోను ఆరుగురు ఆటగాళ్లే ఉంటారు. గరిష్టంగా పది ఓవర్లే ఆడటంతో గంటలోపే మ్యాచ్ అయిపోతుంది. పరుగెత్తి బౌలింగే చేయాలని లేదు. నిలబడి అలా విసిరినా చాలు. టెన్నిస్ బంతినే వాడతారు కాబట్టి గాయాల సమస్యా ఉండదు. నెట్ లోపల పూర్తిగా కృత్రిమ గడ్డి మ్యాట్‌ను ఉపయోగిస్తుండటంతో దుమ్ము కూడా రాదు. పరిగెడుతూ కిందపడినా దెబ్బలు తగలే అవకాశం తక్కువ. వాష్ రూమ్స్, డ్రెస్ చేంజింగ్ రూమ్స్ కూడా ఇందులోనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఫుడ్ కోర్టులు, డ్రింక్స్, స్నాక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని సౌలభ్యాలు ఉండటంతో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోంది. పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు బాక్స్ క్రికెట్‌కు ఆకర్షితులవుతున్నారు. బాక్స్ క్రికెట్‌లో ఫోర్లు, సిక్సర్ల మోత మోగిస్తున్నారు.

ఘనంగా నిట్ స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం: జీవితం వంద మీటర్ల పరుగు పందెం కాదని.. అది మారథాన్ అని.. దానికనుగుణంగా సిద్ధపడాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్, డాక్టర్ రవి శర్మ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ఏపీ నిట్ ఆరో స్నాతకోత్సవ వేడుక శనివారం సాయంత్రం నిట్ రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. రవి శర్మ మాట్లాడుతూ నిత్యాన్వేషిగా ఏదొక కొత్త విషయాన్ని నేర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ నూతన ప్రాజెక్టులు చేపడితే చరిత్రలో నిలిచిపోతారన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ ఏపి నిట్ ప్రగతి పథంలో వెళ్తుందన్నారు. ప్రయోగశాల, పరిశోధనా పరికరాల సేకరణ, మౌలిక సదుపాయాల నిమిత్తం కేంద్రం రూ.754 కోట్లు మంజూరు చేయనుందన్నారు. అంతర్జాతీయ జర్నల్స్‌లో 181 పరిశోధనా వ్యాసాలు ప్రచురితం కాగా, వివిధ సమావేశాలలో 121 పత్రాలు సమర్పించారన్నారు. తమ విద్యార్థులు 70 శాతం ప్లేస్‌మెంట్ సాధించడం శుభపరిణామమన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు అందచేశారు. రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి, డీన్‌లు శాస్త్రి, కురుమయ్య, వీరేష్‌కుమార్, జయరామ్, కార్తీక్ శేషాద్రి, వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.





బీటెక్ టాపర్‌గా బంగారు పతకం అందుకుంటున్న సలాది వెంకట శశి భూషణ్, హాజరైన విద్యార్థులు

శాస్త్రవేత్తగా రాణిస్తా



కంప్యూటర్ సైన్స్‌లో 9.83 గ్రేడ్‌తో నిట్ టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. నాన్న సుబ్బారావు ప్రైవేటు ఉద్యోగి. పేపాల్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తు న్నాను. శాస్త్రవేత్తగా రాణించాలన్నది నా ధ్యేయం.

– సలాది వెంకట శశి భూషణ్, తణుకు

ఈఎస్‌సీలో ఇంజినీర్‌గా..



నాన్న శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ కనకలత జూనియర్ ఇంజినీర్. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 9.12 గ్రేడ్ పాయింట్లు సాధించాను. ఈఎస్‌సీ సర్వీసెస్‌లో ఇంజనీరింగ్‌లో స్థిరపడాలన్నది నా జీవిత ఆశయం.

– గుబ్బల హారిక, రామచంద్రపురం

నా కల నిజమైంది



టాపర్‌గా నిలవాలనుకున్నా. సాధించా. నాన్న శ్రీనివాసరావు సీనియర్ అకౌంట్ మేనేజర్. అమ్మ గృహిణి. క్యాట్ విజన్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. నా కల సాకారమైనందుకు ఆనందంగా ఉంది.

– మంత్రిప్రగడ సాయి అఖిల్

పోస్టింగ్... వెయిటింగ్

- నెలల తరబడి ఎస్సైలు, సీఐల ఎదురుచూపులు
- గందరగోళంగా పోలీస్ బదిలీలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పోలీస్ పోస్టింగుల ప్రక్రియను టీడీపీ సర్కారు పెద్ద ప్రహసనంగా మార్చింది. రకరకాల విచారణల పేరుతో వారానికి ఐదుగురు, పది మందికి పోస్టింగులు ఇవ్వడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. పదుల సంఖ్యలో సీఐలు, ఎస్‌ఐలను వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)లో ఉంచి బందోబస్తుకు వినియోగిస్తూ పోస్టింగులు కేటాయించని పరిస్థితి. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు పోలీస్ జిల్లాల్లో ప్రధానంగా ఎస్సై పోస్టింగులు నెలల తరబడి సాగుతూనే ఉన్నాయి. సాధారణంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మారగానే లేదా ఎమ్మెల్యేలు మారగానే కొత్తవారిని సిఫార్సు చేస్తూ లేఖలు ఇవ్వడం, దానికనుగుణంగా పోలీస్ అధికారుల పనితీరు పరిశీలించి వారం, పది రోజుల వ్యవధిలో పోస్టింగులు కేటాయిస్తారు. ఈ సారి కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటినా ఇంకా అధికారుల పనితీరుపై విచారణ అంటూ కాలయాపన చేస్తూనే ఉన్నారు. ఈ నెల ప్రారంభంలో 44 మంది సీఐల బదిలీలు జరిగాయి. రేంజ్ పరిధిలో 44 పోస్టింగ్‌లు వేసినా 24 గంటల వ్యవధిలోనే ముగ్గురు సీఐలకు నిలుపుదల చేసి మళ్ళీ మార్పులు, చేర్పులు చేశారు. జిల్లాలకు కొత్త ఎస్పీలు వచ్చి నెల రోజులు దాటినా ఎస్సై పోస్టింగులు మాత్రం పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రతి జిల్లాలో ఐదు నుంచి 10 మందికే పోస్టింగులు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేసినా పోస్టింగులు మాత్రం పెండింగ్‌లోనే ఉన్నాయి.

విచారణ పేరుతో వెయిటింగ్ : ఇక రెడ్‌బుక్ రాజ్యాంగం, ఇతర కారణాలతో ప్రతి పోస్టింగ్ పైనా విచారణకు కూటమి ప్రభుత్వం తెరదీసింది. గత ప్రభుత్వ హయాంలో ఏయే స్టేషన్లలో పనిచేశారు.. స్థితిగతులు, కులాల లెక్కలు వేసి పోస్టింగులు కేటాయిస్తున్నారనేది శాఖాపరంగా వినిపిస్తున్న మాట. రేంజ్ పరిధిలో 32 మంది సీఐలు, 76 మంది ఎస్సైలు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో 80 శాతం మందికిపైగా సిఫార్సు లేఖలు ఉన్నా విచారణ పేరుతో దాదాపు నెల రోజులుగా పెండింగ్‌లోనే ఉన్నారు. ఇటీవలే పశ్చిమగోదావరి జిల్లాలో సీనియర్ ప్రజాప్రతినిధి పోస్టింగుల జాప్యం, సూచించిన వ్యక్తికి పోస్టింగ్ ఇవ్వకపోవడం తదితర కారణాలతో రాష్ట్ర స్థాయి పోలీస్ అధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదంతా జరిగి 10 రోజులు దాటినా సదరు ప్రజాప్రతినిధి అడిగిన పోస్టింగ్ మాత్రం పడకపోవడం గమనార్హం. పశ్చిమగోదావరి జిల్లాలో కీలక ఎస్సై పోస్టింగులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. నర్సాపురం రూరల్ మొదలుకొని అత్తిలి వరకు కీలక ఎస్‌ఐ పోస్టులన్నీ భర్తీ కావాల్సి ఉంది. రేంజ్‌లో 2012 బ్యాచ్ ఎస్సైలే ఎక్కువ మంది ఉన్నారు. వీరిలో కొద్దిమందికే పోస్టింగులు ఇవ్వగా.. మిగిలిన వారందరికీ సీఎం పర్యటనల బందోబస్తులు, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉంచారు. పోస్టింగుల కోసం నానా తంటాలు పడుతున్నా దక్కని పరిస్థితి. మొత్తం మీద ఏలూరు, పశ్చిమగోదావరి పోస్టింగుల వ్యవహారం పోలీసులకు ఇబ్బందికరంగా, ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది.

క్లుప్తంగా

గడ్డి వాహనం దగ్ధం


పుట్లగట్లగూడెం వద్ద దగ్ధమైన వాహనం

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో గడ్డి తరలిస్తున్న వాహనం దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లికి చెందిన జె.రమేష్ టి.నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో గడ్డి కొనుగోలు చేశారు. తనకి చెందిన మినీ వ్యాన్‌లో గడ్డి లోడు చేసుకుని దేవులపల్లి బయలుదేరారు. పుట్లగట్లగూడెం సమీపంలోకి వచ్చేసరికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వాహనం నుంచి మంటలు చెలరేగాయి. మంటలలో గడ్డితో పాటు వాహనం కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో రూ.80 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని జంగారెడ్డిగూడెం లీడింగ్ ఫైర్‌మన్ బాబూరావు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లు

కొయ్యలగూడెం: ఎర్రకాలువ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారి వద్ద సచివాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 16వ తేదీ రాత్రి గంగవరం సమీపంలోని ఎర్రకాలువ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల వద్ద నుంచి సిబ్బంది కొందరు వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారి వద్ద పనిచేసే వ్యక్తి బెదిరింపులకు పాల్పడగా అతనికి వత్తాసు పలుకుతూ సచివాలయ ఉద్యోగులు బెదిరింపులకు దిగగా, అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులు ముడుపులు చదివించుకున్నట్లు తెలిసింది. మంగపతిదేవిపాలెం, రాజవరం ప్రాంతాల్లోని ఎర్రకాలువ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తుల నుంచి ప్రైవేటు వ్యక్తులు కూడా బెదిరింపులకు పాల్పడుతూ వేలాది రూపాయలు దండుకుంటున్నారని సమీపంలోని రైతులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

ద్వారకాతిరుమల: స్థానిక వసంత్‌నగర్ కాలనీలో ఒక యువకుడు కొంగల మందు తిని శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం. కాలనీకి చెందిన పోసిబాబు(28) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నారు. ప్రస్తుతం అతని భార్య రెండోప్రసవం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఉంది. అయితే ఓ కేసు విషయంలో నాలుగు రోజుల క్రితం పోలీసులు పోసిబాబును మందలించారు. అయితే ఏం జరిగిందో? తెలియదు కానీ తన చావుకు ఎవరూ కారణం కాదని, సెల్ఫీ వీడియో తీసుకున్న అనంతరం పోసిబాబు తన ఇంట్లో కొంగల మందు తిని మృతి చెందాడు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో పోలీసు కేసు నమోదు కాలేదు.

మంచం పట్టిన పల్లెలు

- జిల్లాను వణికిస్తున్న వైరల్ జ్వరాలు
- ఊరూవాడా జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- కుమ్మరిగూడెంలో 160 మంది బాధితులు
- ముంపు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మృగ్యం
- ఏలూరు జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లకే వైద్య సేవలు
- డెంగీ కేసులను చేర్చుకోని వైనం


వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలో జ్వరంతో బాధపడుతున్న సాంబయ్య

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైరల్ జ్వరాలు జిల్లాను వణికిస్తున్నాయి. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలో ఏలూరుతో పాటు ప్రధాన మున్సిపాల్టీల్లోని ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరాల కేసులతో కిటకిటలాడుతున్నాయి. వేలేరుపాడు మండలంలోని కమ్మరిగూడెం ఒక్క గ్రామంలోనే 160 మంది జ్వరపీడితులున్నారు. అన్ని గ్రామాల్లో ఇదేతరహా కేసులున్నాయి. వాతావరణంలో మార్పులు, వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడం, పల్లెల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లని పరిస్థితులతో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. జిల్లాలో అధికారిక సమాచారం ప్రకారం 900లకుపైగా వైరల్ ఫీవర్ కేసులు ఉన్నాయని చెబుతుండగా వాస్తవ పరిస్థితి రెట్టింపుగా ఉంది.

పడకేసిన పారిశుద్ధ్యం..

వర్షాలు, వరదలతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. పల్లెల్లో ఎక్కడా ఫాగింగ్ కాని, బ్లీచింగ్ చల్లడం కాని పెద్దగా జరగడం లేదు. దీంతో జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఏలూరులోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు 10 రోజుల నుంచి డెంగీ, టైఫాయిడ్ కేసులతో నిండిపోతున్నాయి. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంతో పాటు ఏలూరు, దెందులూరులో అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలో 220 కుటుంబాలు ఉన్నాయి. ఆ గ్రామంలో 160 మందికిపైగా జ్వరపీడితులు ఉన్నారు. వీరిలో సగం మందికిపైగా వైరల్ ఫీవర్లతో బాధపడుతూ కాళ్ల వాపులు, ముఖం వాపు, ఒంటిపై మచ్చలతో ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వరదలు తగ్గి 27 రోజులు గడిచింది. వరద తాకిడికి విలీన మండలాల్లోని 43 గ్రామాలు కకావికలమయ్యాయి. వరద తగ్గిన తర్వాత బురదలోనే ఇళ్లకు వెళ్లి శుభ్రం చేసుకుని నివసిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ చల్లడం, ఇతర పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోవడంతో ఏజెన్సీ ప్రాంతంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

జీజీహెచ్‌లో నో అడ్మిషన్

ఏలూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి (జీజీహెచ్)లో వైద్యులు విచిత్ర ధోరణితో వ్యవహరిస్తున్నారు. జ్వరపీడితులు అవుట్ పేషెంట్లుగా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుని వెళ్తుంటారు. తీవ్రమైన టైఫాయిడ్, ప్లేట్‌లెట్స్ పడిపోయి డెంగీ లాంటి కేసులు అడ్మిట్ చేసుకుని వైద్య సేవలు పొందుతుంటారు. అయితే సాధారణ ఓపీలో కూడా జ్వరం కేసులు చూడటం లేదు. ఇన్‌పేషెంట్‌గా చేరితేనే వైద్యం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల నుంచి ఉత్తర్వులు ఉన్నాయని చెబుతూ రోగులను పరీక్షించడానికి కూడా నిరాకరిస్తున్న పరిస్థితి. ఓ వేళ ఇన్‌పేషెంట్‌గా చేరడానికి వస్తే 350 బెడ్లు మాత్రమే ఉన్నాయి. బెడ్లు ఖాళీ లేవనే మాట వినిపిస్తోంది. దీంతో అనివార్య పరిస్థితుల్లో ఆర్థిక పరిస్థితి సహకరించికపోయినా.. ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ

డెంగీ కేసులు, వైరల్ ఫీవర్ కేసుల్లో దోపిడీకి ప్రైవేట్ ఆస్పత్రులు తెరదీశాయి. ఒక్కో ఆస్పత్రిలో ఒక్కో రేటు పెట్టి సగటున రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డెంగీ బాధితుల నుంచి వసూలు చేస్తున్నారు. జిల్లాలోని ఒక్క ఏలూరులోనే వందల సంఖ్యలో డెంగీ కేసులు ఉన్నాయి. నగరంలోని ఓ హాస్పిటల్‌లో డెంగీకి సంబంధించి రూ.7,500 రోజు అద్దె, మందులు, ఇతర ఖర్చులకు రూ. 10 వేల చొప్పున ఖర్చవుతోంది. సగటున 5 రోజుల నుంచి 7 రోజుల పాటు ఆస్పత్రిలో ఉంచి చికిత్స చేస్తున్నారు. ఇది కాకుండా ప్లేట్‌లెట్స్‌ను అవసరాన్ని బట్టి, డిమాండ్‌ను బట్టి రూ.10 వేల నుంచి 18 వేల వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 220కుపైగా మలేరియా కేసులు, 210 డెంగీ కేసులు, 452 టైఫాయిడ్, 23 చికున్ గున్యా కేసులు నమోదయ్యాయి.

స్కీమ్ కాదు.. స్కామ్ నడిపారు

- ఉపాధి హామీ సిబ్బందిపై డ్వామా పీడీ పి.రాము ఆగ్రహం
- నూజివీడు మండలంలో పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికలో బయటపడ్డ అవకతవకలు


ప్రజావేదికలో తమ గ్రామంలో జరిగిన అక్రమాలను పీడీ దృష్టికి తీసుకువస్తున్న కండ్రిక గొల్లగూడెం మహిళలు

నూజివీడు: 'ఉపాధి హామీ పథకం సిబ్బంది స్కీమ్ అమలు చేసినట్లుగా లేదు.. స్కామ్ నడిపినట్లుగా ఉంది.. ఒక ముఠాలాగా తయారై ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారు..' అంటూ నూజివీడు మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనుల్లో వెలుగుచూసిన అవకతవకలపై డ్వామా ఏలూరు పీడీ పీ రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని అవకతవకలు జరుగుతుంటే ఏపీడీ, ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఏం చేస్తున్నారు, ఏమయ్యారు అంటూ మండిపడ్డారు. నూజివీడు మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి చేసిన ఉపాధి హామీ పథకం పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం పరిశీలనలో వెలుగుచూసిన అవకతవకలు, అక్రమాలను చూసి పీడీనే నివ్వెరపోయారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది అంతా పథకాన్ని అమలు చేయడంలో విఫలమయ్యారని, అన్నీ అవకతవకలేనంటూ అసహనం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.17 కోట్ల పనులను నిర్వహించగా, అందులో కూలీలకు రూ.12.37 కోట్లు, మెటీరియల్ కింద రూ.4.63 కోట్లను చెల్లించారు. పనికి రానివారికి డబ్బులు చెల్లించడం, విజయవాడ, నూజివీడుల్లో నివసిస్తున్న వారికి డబ్బులు చెల్లించడం, వివాహమై ఇతర గ్రామాలకు వెళ్లిన వారికి, చనిపోయిన వారికి సైతం ఉపాధి హామీ పథకంలో డబ్బులు చెల్లించడం వంటి అంశాలు వెలుగుచూశాయి. వీటిలో కొన్ని ఇలా ఉన్నాయి. యనమదలలో అమృత్ సరోవర్ ట్యాంకు పనులకు సంబంధించి రూ.2.28 లక్షలను మస్తర్లు లేకుండానే ఇచ్చేశారు. అలాగే రూ.8.53 లక్షలకు సంబంధించి ఎంబుక్ లేదు. ఆశావర్కరుగా పనిచేస్తున్న మహిళకు 87 రోజులు పనిచేసినట్లు చూపించి రూ.20 వేలు చెల్లించారు. ఒకే కుటుంబంలో ఆరుగురికి జాబ్‌కార్డులు ఇచ్చారు. కాకినాడలో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్న దేవరాజ్ 52 రోజులు పనికి వచ్చాడని చూపి రూ.13 వేలు చెల్లించారు. అన్నవరంలో 97 పనులు చేయగా, రూ.5 లక్షల వరకు అవకతవకలు చోటు చేసుకున్నాయి. జాబ్‌కార్డులు ఇచ్చేందుకు 137 మంది నుంచి రూ.200 నుంచి రూ.2,500 వరకు వసూలు చేశారు. గొల్లపల్లిలో మస్తర్ లేకుండానే నగదు చెల్లించారు. శనివారం రాత్రి వరకు కొనసాగిన సామాజిక తనిఖీ పరిశీలనలో రూ.15 కోట్ల వరకు అవకతవకలు జరిగినట్లు నిర్ధారించినట్లు తెలిసింది.

మీర్జాపురం మహిళల ఆందోళన

మీర్జాపురం శివారు కండ్రిక గొల్లగూడెంకు చెందిన మహిళలు తాము మూడేళ్ల నుంచి పనిచేస్తున్నా డబ్బులు సరిగా ఇవ్వడం లేదని ఆందోళన చేశారు. తమ బ్యాంక్ ఖాతాలో పడిన డబ్బులలో సగం తీసుకుని జాబ్‌కార్డులు లేకుండా పనికి వచ్చిన వారికి ఇచ్చేవారని, దీనికి ఏపీఓ, ఎఫ్ఏ, టీఏలే కారణమని, తమకు న్యాయం చేయాలంటూ పీడీ రామును వేడుకున్నారు. దీనికి పీడీ బదులిస్తూ సామాజిక ఆడిట్‌లో తమ దృష్టికి వచ్చిన అవకతవకలపై మాత్రమే తాము రికవరీ పెట్టగలమని స్పష్టం చేశారు. ఇతర సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ శ్రీదేవి, అంబుడ్స్‌మన్ బాషా, స్టేట్ రీసోర్స్ పర్సన్ సూర్యచక్ర, డ్వామా ఏపీఓ నాగరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, ఎంపీడీవో వేమూరి ఏంజల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్న తిరుపతికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి క్షేత్రంలో భక్తులతో రద్దీగా ఉన్న దృశ్యం, అంతరచిత్రంలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతిగా పేరొందిన ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, శ్రావణ మాస పర్వదినాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అనివేటి మండపంలో పలు భజనమండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి.

'ఉపాధ్యాయ' ఓటు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు టౌన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు, పశ్చి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టినట్లు తణుకు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పనిచేసే సెకండరీ స్కూల్, జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో మూడేళ్లు ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఈ ఓటరు జాబితాలో పేరు నమోదుకు అర్హులన్నారు. ఓటరుగా నమోదు చేసుకునే వారు ఫారం -19ను పూర్తి చేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఎంఈఓ ద్వారా అందజేయాలని సూచించారు. దరఖాస్తులు ఎంఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీలోగా అందజేయాలని కోరారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల భారీ ర్యాలీ


ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న మాలలు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దీనిని పునస్సమీక్షించాలని మాలజాతి పోరాట యోధుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. తీర్పును నిరసిస్తూ శనివారం ఏలూరులో సామాజిక న్యాయ పోరాట యోధుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన మాలలు భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై కర్రల వంతెన, వసంత్‌మహల్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్, జెడ్పీ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రైవేటు రంగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని, జనగణన, కులగణన తరువాతే వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాలలు 85 లక్షల మంది ఉన్నారని, రిజర్వేషన్లను 20 శాతానికి పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు.

27న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను స్థాయి సంఘాల ఎన్నిక కార్యక్రమం, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందని సుబ్బారావు తెలియజేశారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పోక్సో కేసులో నిందితుడిని డీఎస్పీ యు.రవిచంద్ర అరెస్టు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం రూరల్ మండలానికి చెందిన బాలిక కాళ్లకూరులోని అమ్మమ్మ ఇంటి వద్ద తల్లితో కలిసి ఉంటోంది. కాళ్లకూరు గ్రామానికి చెందిన యువకుడు ముళ్లపర్తి రాజేష్ ప్రేమిస్తున్నానని చెప్పి ఆమె వెంటపడటమే కాకుండా, బాలికను లంబసింగి తీసుకువెళ్లాడు. అక్కడ బాలికకు తాళిబొట్టు కట్టి, పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. బాలిక లంబసింగిలో ఉందని తెలుసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ కేసులో నిందితుడైన రాజేష్‌ను డీఎస్పీ రవిచంద్ర శనివారం అరెస్టు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆక్వాకు అందని బడ్జెట్ ఫలాలు

- పన్ను తగ్గినా రొయ్యల మేత ధరల్లో మార్పు శూన్యం
- మేత ముడిసరుకుపై పన్ను తగ్గించినా దక్కని లబ్ధి
- ఎకరాకు రూ.3.50 లక్షలకు పైబడి దాణా ఖర్చు
- దాణా ధర తగ్గితే ఎకరాకు రూ.35 వేల వరకు ఆదా
- ఉమ్మడి జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు


అమ్మకానికి సిద్ధం చేసిన రొయ్యల ఫీడ్ బస్తాలు


భీమవరం ప్రాంతంలో ఖాళీగా ఉన్న చెరువులు

భీమవరం: ఆక్వా దాణా ధరలకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో పన్ను తగ్గించినా రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో రైతులు పెదవి విరుస్తున్నారు. ఇటీవల ఆక్వా దాణా ధరలు విపరీతంగా పెరగడంతోపాటు రొయ్యలకు తెగుళ్లు సోకడంతో సాగు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రొయ్యల ధర కొంతమేరకు పెరిగినప్పటికీ పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో నష్టాలను చవిచూస్తున్నామంటూ అనేక మంది రొయ్యల రైతులు సాగుకు వెనకడుగువేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులుండగా, ఇటీవల సాగు కలిసి రాకపోవడంతో అనేకమంది రైతులు చెరువులను ఖాళీగా ఉంచారు.

జగన్ ప్రభుత్వంలో రొయ్యల రైతులకు అండగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రొయ్యల రైతులకు అండగా నిలిచింది. ప్రధానంగా రొయ్యల చెరువు వద్ద వినియోగించే విద్యుత్‌కు ప్రత్యేక సబ్సిడీ ఇచ్చి యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.50కే ఇవ్వడం రైతులకు ఎంతో మేలు చేసింది. అంతేగాకుండా రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఖర్చుతో ఏర్పాటుకు అవకాశం కల్పించింది. కరోనా సమయంలో సైతం రొయ్యల ధరలు తగ్గకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా అధికారులను ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. అలాగే రొయ్యల మేతల తయారీ కంపెనీలు ధరలను పెంచితే ఫ్యాక్టరీ యజమానులతో మంత్రులు, అధికారులతో ఏర్పాటుచేసిన కమిటీ సమావేశాలు నిర్వహించి పెంచిన మేత ధరలు తగ్గించేలా చర్యలు తీసుకుంది. రొయ్యల ధరలు నిలకడగా ఉండేందుకు అప్పుడా కృషి చేసింది.

తగ్గని రొయ్యల మేత ధరలు

జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండగా, ఒక్కొక్క పంటకు ఎకరాకు సుమారు 3 టన్నుల దాణాను వినియోగిస్తారు. దాణా 25 కిలోల బస్తా సుమారు రూ.2,750 నుంచి రూ.2,964 వరకు ధరలను నిర్ణయించాయి. ఈ విధంగా టన్ను ధర దాదాపు రూ.1.18 లక్షల వరకు ఉంటుంది. దీని ప్రకారం ఎకరాకు రూ.3.50 లక్షల వరకు కేవలం మేతకే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దీంతోపాటు చెరువులకు లీజు చెల్లింపు, విద్యుత్ బిల్లులు, వివిధ రకాల కెమికల్స్, రొయ్యలకు తెలుగుళ్లు వ్యాపిస్తే నివారణ మందులు వంటి వాటికి దాదాపు రూ.4 లక్షలకుపైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇటువంటి తరుణంలో కేంద్ర బడ్జెట్‌లో రొయ్యల మేతల తయారీకి ఉపయోగించే ముడిసరుకుపై పన్ను తగ్గించడంతో మేతల ధరలు 10 శాతం వరకు తగ్గుతాయని రైతులు ఆశించారు. అయితే కేంద్ర బడ్జెట్ ప్రకటించి రెండు నెలలు గడిచిపోతున్నా రొయ్యల ఫీడ్ ధరల్లో ఎటువంటి మార్పులేదు. దీనిపై కూటమి ప్రభుత్వం రొయ్యల ఫీడ్ ధరలు తగ్గించేందుకు ఎటువంటి కృషి చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిలకడ లేని ధరలతో తీవ్ర నష్టం

రొయ్యల ధరలు నిలకడలేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత నెలలో భారీ వర్షాలు, చలిగాలులు కారణంగా రొయ్యలకు ఆక్సిజన్ లోపంతో తెగుళ్లసోకి చనిపోయాయి. దీంతో ఎక్కువ మంది రైతులు పెద్దకౌంట్ రొయ్యల పట్టుబడి పట్టడంతో ప్రస్తుతం వేలాది ఎకరాల్లోని చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో సరుకులేక గత పది రోజులుగా 100 కౌంట్ రొయ్యలు రూ.250 వరకు కొనుగోలు చేస్తున్నారు. మిలిగిన కౌంట్ ధరలు కూడా కొద్దిగా పెరిగినప్పటికి పెరిగిన పెట్టుబడులతో పోల్చితే పెరిగిన రొయ్యల ధరలు రైతులకు ఎటువంటి సంతృప్తిని మిగల్చడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మేతల ధరలు తగ్గించాలి



కేంద్ర బడ్జెట్‌తో రొయ్యల మేతలు తగ్గుతాయని ఆశించాం. ప్రభుత్వం పన్ను తగ్గించడంతో మేతలు ధరలు తగ్గి ఎకరాకు రూ.35 వేలు వరకు కలిసి వస్తుందని భావించాం. అయితే రొయ్యల మేతల ధరల్లో ఎటువంటి మార్పులేకపోవడంతో పెట్టుబడులు పెరిగి సాగు చేయడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మేతలు తగ్గించడానికి కృషి చేయాలి.

– గన్నాబత్తుల హేమసత్యకృష్ణ, రొయ్య రైతు, తోలేరు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రొయ్యల మేతల ముడిసరుకుపై పన్ను తగ్గించడంతో తయారీ కంపెనీలు కూడా ఆ మేరకు మేతల ధరలను తగ్గించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు లేదు. రొయ్యల ధరలు నిలకడగా లేకపోవడం, మేతల ధరలు పెరగడంతో రైతులు నష్టపోతున్నారు. మేతల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– గాదిరాజు వెంకటసుబ్బరాజు (జీకేఎఫ్), ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, భీమవరం

క్లుప్తంగా

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

'మానవత' ఆర్థిక సాయం



తణుకులో రోగికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన క్యాన్సర్ బాధితుడికి తణుకు మానవత సంస్థ రూ. 3 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆసంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. తణుకు ఎన్టీయార్ పార్కు వద్ద చెప్పులు కుట్టుకుని జీవించే ఆముదాల వెంకట్రావు అనే వ్యక్తి క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్నాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం తణుకు మానవత సభ్యులు శనివారం సాయంత్రం రూ. 3 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మానవత కార్యదర్శి బీ రామకాశీ, రమణమూర్తి, ఆలపాటి సుబ్బారావు, ఏకేటీపీ పాఠశాల హెచ్ఎం టీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

అత్తిలి: ఈనెల 21న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని సీహెచ్ శ్రీనివాసబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



అత్తిలిలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు, విద్యార్థులు

అత్తిలి: ప్రపంచశాంతి, మానవత విలువలు, పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ అత్తిలి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అత్తిలిలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఎస్వీఎస్ఎస్ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు గ్రామ పురవీధులలో శాంతిర్యాలీ జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచార ఘనటకు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఆనాల ఆదినారాయణరావు, అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, కార్యదర్శి కొరిపల్లి హరి, కోశాధికారి కుక్కల వెంకట రామారావు, ఉపాధ్యక్షుడు ఆకుల ఆంజనేయులు, సహాయ కార్యదర్శి కొరిపల్లి విజయ్‌కుమార్, మద్దుల జగదీష్, కొనగళ్ల అనిల్, సత్తిరామకృష్ణబోస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి జ్యోతికశ్రీకి అభినందనలు



క్రీడాకారిణి జ్యోతికశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: ఇటీవల పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొని స్వదేశానికి విచ్చేసిన దండి జ్యోతికశ్రీను స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. శనివారం తణుకులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన జ్యోతికశ్రీను సత్కరించి అభినందించారు. పరుగు పందెంలో భారత్ తరపున జ్యోతికశ్రీ ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టి కష్టపడి అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో విజయాలు సాధించిన జ్యోతికశ్రీ ఒలింపిక్స్ స్థాయికి వెళ్లడం అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మృత్యు కూడళ్లు



ప్రమాదాలు జరిగిన సమయాలలోనే హెచ్చరిక బోర్డులు, స్టాపర్స్ ఏర్పాటు (ఫైల్)



ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారికి అనుసంధాన రోడ్డు

- జాతీయ రహదారి కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు
- రక్షణ చర్యలు తీసుకోని హైవే అధికారులు

పెంటపాడు: గ్రామాల్లో జాతీయ రహదారి కూడళ్ల ప్రమాదాలకు నిలయంగా మారాయి. గ్రామాల రహదారులు జాతీయ రహదారికి అనుసంధానమయ్యే ప్రాంతాల్లోనే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. పెంటపాడు మండలంలోని 15కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారి విస్తరించి ఉంది. బాదంపూడి నుంచి తణుకు వై. జంక్షన్ వరకు జాతీయ రహదారి ఉంది. పెంటపాడు, ప్రత్తిపాడు, అలంపురం, రాచర్ల సెంటర్, వెంకయ్యకాలువ, ప్రత్తిపాడు ఆటో నగర్, నిట్‌సెంటర్ గ్రామాల హైవే కూడళ్ల వద్దే గ్రామ రహదారుల మలుపులు ఉండడంతో రెండో వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించవు ఫలితంగా వాహనదారుల ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డు దాటేటప్పుడే ప్రమాదాలు జరుగుతున్నాయి ఆ సమయాల్లో పొలాలకు వెళ్లే రైతులు, దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో హైవే కూడళ్లు రద్దీగా ఉంటాయి. హడావుడిగా రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు.

మూడేళ్లలో 97మంది మృత్యువాత

గత మూడేళ్లలో జాతీయ రహదారిపై మండలంలో అధికారికంగా 355 ప్రమాదాలు సంభవించాయి వాటిలో 225మందిక్షతగాత్రులవగా మిగిలిన 97మందీ ప్రాణాలు కోల్పోయారు ఇవే కాకుండా రికార్డులో నమోదు కాని మరెన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇవన్నీ కూడా గ్రామ కూడళ్ల వద్దే జరగడం విశేషం.. జాతీయ రహదారి ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికీ గ్రామ కూడళ్ల వద్ద రక్షణ పరంగా చేయవలసిన ఏర్పాట్లు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే ఈ స్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

జాతీయ రహదారి నిబంధనలు

జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామ కూడళ్ల వద్ద డివైటర్లను (రోడ్డు కటింగ్‌లు) ఏర్పాటు చేసినప్పుడు గ్రామాల నుంచి వచ్చే రహదారులకు ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. ఈ డివైడర్ల వద్ద పాదచారులు, వాహనదారలు కోసం జీబ్రా గుర్తులు వేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ గుర్తులు ఉన్నట్లయితే వాహనదారులు ఆ ప్రాంతాన్ని గ్రామ కూడలిగా గుర్తించి వేగాన్ని తగ్గించి వెళతారు. డివైడర్ల వద్ద ప్రమాద హెచ్చరికలు తెలిపే బొమ్మలు వేయవలసి ఉన్నా ఏర్పాటు చేయలేదు. వాహనాల వేగాన్ని తగ్గించడానికి స్పీడ్ కంట్రోల్ స్టాప్ బోర్డులన కానీ, సర్వీస్ రోడ్లు, ఐరన్ మెష్‌లు గాని ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారి గ్రామ కూడళ్ల వద్ద ఎక్కడా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయలేదు. అందువల్లే గ్రామ కూడళ్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చర్యలు తీసుకొంటాం. దీంతో పాటు, నియోజకవర్గ పరిధిలో పలు రహదారులలో ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను హైవే అధికారుల ద్వారా గుర్తించి జాతీయ రహదారులలో ప్రమాదాలు జరగకుండా చూస్తాం. ఇప్పటికే సీసీ కెమెరాల నిఘాలో జాతీయ రహదారులు ఉన్నాయి.

– కొండలరావు పట్టణ ట్రాఫిక్ ఎస్సై గూడెం

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి



తణుకు సబ్ జైలులో ముద్దాయిలకు పెట్టే ఆహారాన్ని రుచిచూస్తున్న న్యాయమూర్తి పీవీ రంజిత్‌కుమార్

తణుకు అర్బన్: జైళ్ల శాఖ నిబంధనల ప్రకారం రిమాండ్ ముద్దాయిలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పీవీ రంజిత్‌కుమార్ అన్నారు. నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు శనివారం తణుకు సబ్ జైలును న్యాయమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా జైలు ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ముద్దాయిలకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే జైలు అధికారికి తెలియజేయాలని సూచించారు. న్యాయవాది పెట్టుకునే స్థోమతలేని ముద్దాయిలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ముద్దాయిలకు పెడుతున్న ఆహారాన్ని న్యాయమూర్తి స్వయంగా రుచిచూశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటిండెంట్ జి.మోహనరావు, న్యాయవాదులు చింతపల్లి నాగేశ్వరరావు, లజలంక అజయ్‌కుమార్, తిర్రే సత్యనారాయణరాజు, పైడి ధనుంజయ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): నీటి నిల్వలు దోమలకు నిలయాలని, వారంలో ఒక రోజు పొడి వాతావరణ కలుగుజేద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14, 34, 35 వార్డులలో ఫ్రైడే, డ్రైడే, కుటుంబ సర్వేలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలతాయని, నీటి నిల్వలు ఉండే ప్రాంతంలో పెరుగుతున్న లార్వాను గుర్తించి వాటిని నిర్మూలించాలన్నారు. ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని, జ్వరం వచ్చిన వారు ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు ప్రశాంతి, రాజేశ్వరి, జ్యోతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆషా కార్యకర్తలు అభిలాష, వరలక్ష్మి, భవాని, స్వాతి, లక్ష్మి, శానిటేషన్ కార్యదర్శి దివ్య తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి



బల్లిపాడులో మెరిట్ విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు శ్రీమదన గోపాలస్వామి దేవస్థానం, బల్లిపాడు సహకార సంఘం, గ్రామపెద్దల సహాయంతో నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ప్రముఖుల ఆకాంక్షించారు. ఎంపీటీసీ ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ఆకుల రామచంద్రరావు, కసిరెడ్డి అప్పారావు, దాసం శ్రీనివాస్, ప్రగడ శ్రీనివాస్, గారపాటి వెంకట సుబ్బారావు, ముత్యాల నాగేశ్వరరావు, గారపాటి ధర్మయ్య, విత్తంశెట్టి సత్తిబాబు, గారపాటి అశోక్, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, దాసం ఆదియ్య పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ ముత్యాల వీరవెంకటసత్యనారాయణ స్పోర్ట్స్ కిట్, వల్లభనేని వీరభద్రరావు కంప్యూటర్, ఎస్ఎంసీ చైర్మన్ అరుగుల వెంకటకృష్ణ సీసీ కెమెరాలను బహూకరించారు. వలవల బాబ్జీ, మాజీ సర్పంచ్ ముత్యాల వీరవెంకట సత్యనారాయణ ఎంపీడీవో విశ్వనాథ్, ఎస్ఎంసీ వైస్‌చైర్‌పర్సన్ చిమ్మి వరలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ప్రభుత్వ వైద్యుల ర్యాలీ



తణుకు అర్బన్: కోల్‌కతా ఘటనకు నిరసనగా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ అరుణ



పెంటపాడు: నిరసన తెలుపుతున్న వైద్యులు

తణుకు అర్బన్: కోల్‌కత్తాలో విధినిర్వహణలో ఉన్న వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరిపి హత్యచేసిన ఘటన అత్యంత హేయమైనదని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి వైద్యవర్గాలు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారి ప్రాణాలు రక్షించే వైద్యులపై ఈ రకమైన దాడులకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటుచేసి వైద్యులు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. సంఘ నాయకులు వైవీఎస్‌బీ రాయుడు మాట్లాడుతూ ప్రాణాలు పోసే వైద్యుల ప్రాణాలు తీసే మృగాళ్లకు తగిన శిక్షవేసి మరల ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ప్రాణాలు పోసే వైద్యులపైనే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వైద్యవర్గాలపై దాడులు చేసే వారిపై చట్టాలు మరింత కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్రపతి రోడ్డు మీదుగా తహసీల్దారు కార్యాలయం వద్దకు వెళ్లి తహసీల్దారు డి.అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళా డాక్టర్‌ను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రూపా శంకర్, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస రాజులు డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ లేడీ డాక్టర్‌ను కిరాతకంగా హత్య చేసి, సభ్య సమాజం తలదించుకునేలా చేసినటువంటి దోషులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రాణాలను రక్షించే వైద్యులకు ప్రాణరక్షణ కరువైతే ప్రజల గతేంటని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా, పురుష వైద్యులకు ప్రత్యేక రక్షణ చర్యలు కల్పించాలని కోరారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో వైద్యులు ఏవీఆర్ఎస్ తాతారావు, సాంబశివరావు, చైతన్యకిరణ్, మహిళా వైద్యులు మైథిలి, రూఫస్, ఇనిమిశెట్టి శ్రీనివాస్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

హత్యాచార నిందితులను శిక్షించండి

పెంటపాడు: కోల్‌కతాలో వైద్యకళాశాల పీజీ విద్యార్థినిపై సామూహిక హత్యాచార ఘటనపై శనివారం వైద్యులు నిరసన గళమెత్తారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ పిలుపు మేరకు పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి ఏఎఎన్ఎంలు నిరసనలో పాల్గొన్నారు. పెంటపాడులో డాక్టర్‌లు తోట రాజేష్, మౌనికలు, ముదునూరు పీహెచ్‌సీలో డాక్టర్ పవన్‌కుమార్‌లు ఆధ్వర్యంలో గేట్ సెంటర్, ముదనూరు సెంటర్‌లలో నిరసన చేపట్టి, నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల సిబ్బంది సత్యనారాయణ, తేజోనాథ్, మెర్సీ, ఆయా గ్రామాల ఎంఎల్‌హెచ్‌పీవోలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు తరలివెళ్లిన ప్రత్యేక బస్సు



అరుణాచలం ప్రత్యేక బస్సుకు తరలివెళ్లుతున్న ప్రయాణీకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీస్ శనివారం రాత్రి తాడేపల్లిగూడెం బస్ స్టేషన్ నుంచి యాత్రికులతో తరలివెళ్లింది. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు 18వ తేదీన ఉదయం శ్రీ కాళహస్తి, స్వామి వారి దర్శనం, అనంతరం కాణిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, అన్న ప్రసాదాలు, రాత్రి శ్రీపురం శ్రీ మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్, అమ్మవారి దర్శనం, 19వ తేదీన పౌర్ణమి తెల్లవారుజామున రెండు గంటలకు అరుణాచలం, అక్కడ గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం, అక్కడ నుంచి శివ కంచి, వామన కంచి, విష్ణుకంచి దర్శించి 21వ తేదీన తాడేపల్లిగూడెం చేరుతుందని చెప్పారు. సెప్టెంబర్ 16వ తేదీన మళ్లీ పౌర్ణమికి గిరి ప్రదక్షిణ బస్ సౌకర్యం ఉందని, చార్జీ కేవలం 2,600 మాత్రమేనని, కంచికి రూ 3,000 అన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫోన్ నంబర్లు 9959225488, 9959753102, 9985544411లను సంప్రదించాలని కోరారు.

దూర విద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



దూరవిద్యా విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: దూర విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి ఎన్ రమేష్ చెప్పారు. దూర విద్యావిధానంపై అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన వారు దూర విద్యలో పదో తరగతిలో చేరడానికి 14 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలన్నారు. పదో తరగతి పాసైన వారు దూర విద్యలో ఇంటర్మీడియేట్‌లో చేరవచ్చన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 31వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, అంగన్‌వాడీ వర్కర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో -2 ఎంపీఎల్‌కే ప్రసాద్, పెనుమంట్ర మండల ఎంఈవో -1 వై లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి




దర్శిపర్రు గ్రామంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

పెంటపాడు: రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండలంలోని పలు గ్రామాలను ఏవో పార్థసారదితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతూ వారి పంటకు రాయితీలు, ఇన్సూరెన్స్ పొందేందుకు వీలుగా ఈ క్రాఫ్ నమోదు తప్పక చేయించుకోవాలన్నారు. వివరాలకు ఆయా వ్యవసాయ కేంద్రాలు, ఆర్బీకేలను సంప్రదించాలన్నారు.

తణుకు నుంచి భద్రాచలానికి అల్ట్రా డీలక్స్ బస్సు

తణుకు అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం తణుకు ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలంకు అల్ట్రా డీలక్స్ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. తణుకులో శనివారం అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజు రాత్రి 8.30 గంటలకు తణుకు నుంచి బయలుదేరే బస్సు తాడేపల్లిగూడెం, నల్లజర్ల, పోతవరం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, మందపల్లి, సత్తుపల్లి, బూరుగుంపాడు మీదుగా తెల్లవారుజామున 3.10 గంటలకు భద్రాచలం చేరుతుందని, తిరిగి ఉదయం 10.15 గంటలకు భద్రాచలం నుంచి బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు తణుకు చేరుతుందని చెప్పారు. టికెట్ ధర పెద్దలకు రూ. 415లు, పిల్లలకు రూ. 220లుగా నిర్దేశించబడిందని, రిజర్వేషన్ కోసం 94404 19144 నంబరులో సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



పాలూరు ప్రాథమిక పాఠశాలకు బీరువాను బహూకరిస్తున్న దృశ్యం

అత్తిలి: పాలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అంబటి ఫ్లోరెన్స్ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు బీరువాను బహూకరించారు. ఫ్లోరెన్స్ గతేడాది ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ మృతి చెందారు. ఫ్లోరెన్స్ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్ దంపతులు పాఠశాల సిబ్బందికి బీరువాను అందజేశారు. పాలూరు సర్పంచ్ తానుకొండ దయామణిదావీదు, ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.